క్లుప్తంగా

నేడు ప్రభుత్వ విప్ పీఆర్కే సత్రశాల రాక

రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద వేంచేసిన అతిపురాతనమైన శైవక్షేత్రం శ్రీ గంగా మల్లిఖార్జునస్వామి దేవస్థానం నూతన ట్రస్ట్‌బోర్డు పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గురువారం సత్రశాలకు రానున్నట్లు ఎండోమెంట్ కార్యనిర్వహణ అధికారి గాదె రామిరెడ్డి తెలిపారు. ఉదయం 10.45 గం.లకు దేవస్థానం ఆవరణలో నూతన దేవస్థానం చైర్మన్‌గా బద్దూరి బ్రహ్మారెడ్డి, పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, గౌరవ అతిథులుగా జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంఠిరెడ్డి నర్సిరెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, జెట్టిపాలెం సర్పంచ్ దావులూరి ఉదయ కుమారి రమేష్, ఎంపీటీసీ రమావత్ సీతమ్మ పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు.

నేడు సత్రశాలలో సమీక్ష సమావేశం

రెంటచింతల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సత్రశాలలోని శ్రీ గంగా మల్లిఖార్జున స్వామి దేవస్థానం ఆవరణలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ షేక్ గౌసియా బేగం బుధవారం తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్గొంటారన్నారు. దేవాదాయశాఖాధికారులు, మండల స్థాయి వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, దేవస్థానం పాలకవర్గం సభ్యులతో మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

మాదలలో ఆధార్ సేవలు ప్రారంభం

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ఆదేశాల మేర ఆధార్ కేంద్రం ద్వారా సేవలను ప్రారంభించారు. మండల పరిధిలోని ఐదు గ్రామాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పీ.పుట్టారెడ్డి తెలిపారు. ముప్పాళ్ళ గ్రామ సచివాలయం, నార్నెపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల, దమ్మాలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల, బొల్లవరం జెడ్పీ ఉన్నత పాఠశాల, గోళ్ళపాడు కేజీబీవీ పాఠశాలల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించి, ఆధార్ కార్డులో చేర్పులు, మార్పులు, సవరణలు చేసుకునే వీలుంటుందన్నారు. మండల వాసులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాదల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయుడు రమేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

నిర్మాణంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలను పరిశీలించిన ఎమ్మెల్యే

క్రోసూరు: త్వరలో ప్రారంభం కానున్న ప్రభుత్వ పాలిటెక్నిక్‌కళాశాల నూతన భవనంలో జరుగుతున్న పనులను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు బుధవారం పరిశీలించారు. త్వరలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదగా ప్రారంభోత్సవం జరుపుకోవాల్సి ఉన్నందున శరవేగంగా పనులు పూర్తిచేయాలని సంబంధిత అధికారులను సూచించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



నకరికల్లు: విద్యుత్‌షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కుంకలగుంట గ్రామంలో బుధవారం జరిగింది. ఘటనకు సంబంధించిన పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన మాదినీడి శ్రీనివాసరావు (52) కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికునిగా పనిచేసి జీవనోపాధి పొందుతున్నాడు. బుధవారం గ్రామంలోని గుడి సమీపంలో మరమ్మతుల కోసం విద్యుత్‌స్తంభం ఎక్కాడు. షాక్‌కు గురికావడంతో స్తంభంపై నుంచి కిందపడ్డాడు. దీంతో తీవ్రగాయాలు గాయాలయ్యాయి. స్పృహకోల్పోయిన క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలించేందుకు ఆటోలో తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. మృతునికి భార్య శివకుమారి, నలుగురు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.సురేష్ తెలిపారు.

తెలుగు మహిళల్లో వర్గ పోరు

పెదకూరపాడు: పెదకూరపాడు మండల తెలుగు మహిళ నాయకురాళ్లలో వర్గ పోరు తారా స్థాయికి చేరింది. గత కొంత కాలంగా తెలుగు దేశం మహిళ నాయకురాళ్ల మధ్య అంతర్గతంగా ఉన్న విభేదాలు సోషల్ మిడియా సాక్షిగా బయట పడ్డాయి. మండలంలోని హుస్సేన్‌నగరం గ్రామానికి చెందిన ఆరుమల్ల సుజాత పల్నాడు జిల్లా తెలుగు మహిళ కార్యదర్శిగా ఉన్నారు. పల్నాడు జిల్లా తెలుగు మహిళ కార్యనిర్వహక కార్యదర్శిగా ఉన్న షేక్ ముంతాజ్ మధ్య విభేదాలు చాలా కాలంగా నడుస్తున్నాయి. ఈ క్రమంలో షేక్ ముంతాజ్‌పై సోషల్ మిడియాలో సుజాత ఆరోపణలు చేయడంతో షేక్ ముంతాజ్ మరో ముగ్గురుతో కలిసి హుస్సేన్ నగరం గ్రామంలో ఉన్న ఆరిమల్ల సుజాత ఇంటికి వెళ్లి దాడి చేసి తన ఫోను తీసుకెళ్లి, తనను దుర్భాశలాడినట్లు పెదకూరపాడు పోలీసుస్టేషన్‌లో సుజాత ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విచారించిన పోలీసులు మూడు సెక్షన్లు కింద షేక్ ముంతాజ్‌తో పాటు మరో ముగ్గురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకట కృష్ణారావు తెలిపారు.

నెరవేరిన ఎన్నోఏళ్ల నాటి కల

- ఆరు గ్రామాల ప్రజలకు లబ్ధి
- తొలి విడతలో 81 మందికి పట్టాలు పంపిణీ
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, జేసీ

గురజాల : ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారి కల నేటికి నెరవేరింది. గత 11 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూమికి హక్కు కోసం వారు పోరాడుతున్నందుకు ఫలితం లభించింది. గత కొన్ని సంవత్సరాలుగా సాగు చేస్తున్న భూములకు వారికి హక్కులు ఇన్నాళ్లుకు చేతికి చిక్కాయి. ప్రభుత్వం నుంచి అందించే ప్రతి సంక్షేమ పథకం వారికి కూడా చేరనున్నాయి. 2011వ సంవత్సరంలో చివరి సారిగా భూమికి హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేశారు. తరువాత అధికారంలోకి వచ్చిన వారు పట్టాల గురించి పట్టించుకున్న దాఖలాలు కనిపించలేదు. అప్పటి నుంచి ఎన్నో ప్రయత్నాలు చేసినా ఎంతో మంది అధికారులను కలిసినా వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లిన వారి సమస్యకు పరిష్కారం మాత్రం లభించలేదు. ఇన్నాళ్లకు తమకు ప్రభుత్వం స్పందించి తమకు హక్కులను కల్పించడం ఎంతో ఆనందంగా ఉందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

81 మంది లబ్ధిదారులకు పంపిణీ...

నియోజకవర్గంలో 6 గ్రామాలకు చెందిన 81 మంది లబ్ధిదారులకు 87 ఎకరాల 42 సెంట్ల భూమికి హక్కు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేశారు. గురజాల మండలంలోని దైద, గోగులపాడు, చర్లగుడిపాడు, దాచేపల్లి పరిధిలోని కేసానుపల్లి, రామాపురం, పిడుగురాళ్ల మండలం జానపాడు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఎమ్మెల్యే కాసుతో సాధ్యం...

ఎన్నికల ముందు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేపట్టిన అదేబాట కార్యక్రమం మరియు ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాల్లో ఈ విధమైన సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి వెళ్లాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరించాలనే ఆలోచనతో ముందుకు సాగారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలతో కలిసి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి జిల్లా అధికారులతో చర్చించి సమస్య పరిష్కరించే విధంగా కృషి చేశారు. దీంతో పలువురు లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో పట్టాలు పంపిణీ ఈ క్రింది విధంగా

గ్రామం	ఎస్సీ	ఎస్టీ	బిసి	ఓసీ	మొత్తం ఎకరాల్లో
దైద	21	0	7	6	53.12
గోగులపాడు	0	0	0	1	0.61
చర్లగుడిపాడు	0	0	0	1	1.00
కేసానుపల్లి	15	0	4	5	12.00
రామాపురం	2	1	7	6	16.00
జానపాడు	0	0	0	5	4.68
మొత్తం	38	1	18	24	87.42సెంట్లు

20 సంవత్సరాలుగా ఎదురుచూసాం..



మేము గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వ భూమిని సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. వ్యవసాయంపై ఆధారపడ్డాం. గతంలో ఎన్నిమార్లు ప్రయత్నించిన మాకు ఫలితం దక్కలేదు. మేము పడుతున్న ఇబ్బందులను నాయకుల దృష్టికి తీసుకువెళ్లాం. వెంటనే ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి గారి దృష్టికి తీసుకువెళ్లి నాకు సాగు చేసుకుంటున్న భూమికి నాకు పట్టా మంజూరు చేసి నాకు అందించారు. రుణం ఎన్నటికి మర్చిపోలేను. ఎంతో ఆనందంగా ఉంది.

– కడియం కోటేశ్వరి, దైద, లబ్ధిదారురాలు

ఆనందంగా ఉంది...



నా పేరిట ప్రభుత్వ భూమికి పట్టా ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది. ఎంపీ, ఎమ్మెల్యేలకు మా కుటుంబం ఎల్లప్పుడు రుణపడిఉంటాం. విచారణ జరిపి మాకు భూమి ఏమిలేదు అని తెలుసుకుని మాకు పట్టాలు పంపిణీ చేశారు. నా పేరుమీద పట్టా ఇస్తున్నారని తెలియడంతో పెద్ద పండుగ వచ్చినట్లు అనుకున్నాం. ఎంపీ , ఎమ్మెల్యేల కృషి మరువలేనిది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదలకు అండగా ఉన్నారనుటకు ఇదొక ఉదాహరణ

– పేరుపోగు అరుణ, లబ్ధిదారురాలు

సమగ్ర సమాచారంతో హాజరు కావాలి

ఎంపీపీ బూడిద మంగమ్మ



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బూడిద మంగమ్మ

మాచర్ల రూరల్: సర్వసభ్య సమావేశానికి హాజరయ్యే అధికారులు అభివృద్ధి పై వివరాలతో కూడిన పక్కా నివేదికను తీసుకురావాలని, ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు వారధిగా పనిచేయాలని ఎంపీపీ బూడిద మంగమ్మ కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని, అలాగే స్థానిక సర్పంచ్, ఎంపీటీసిల ద్వారా వచ్చిన వినతులను సకాలంలో సమస్యలను పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసి మండ్లి పెద మల్లుస్వామి, మండల ఉపాధ్యక్షులు పోతిరెడ్డి సుజాత కోటిరెడ్డి, ఎంపీడీఓ కోటేశ్వరరావు, ఎంఈఓ వేముల నాగయ్య, ఎఈలు సురేంద్ర, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం చేసుకున్న పోలీసులు

గురజాల : మండల పరిధిలోని మాడుగుల గ్రామంలో నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బి ఆనంత కృష్ణ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆమె మాట్లాడుతూ మాడుగుల గ్రామానికి చెందిన కంద్రకోండ కోటేశ్వరరావు ఇంట్లో నాటుసారా వుందని సమాచారం రావడంతో వెళ్లి తనిఖీ చేయగా 4 లీటర్లు నాటు సారా ఉన్నట్లు గుర్తించారు. నిందితుడు కోటేశ్వరరావు పరారీలో ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అక్రమ మద్యంపై చర్యలు తప్పవు

గురజాల : అక్రమ మద్యం కలిగి వుంటే చర్యలు తప్పవని ఎస్ఐ అశోక్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు మండల పరిధిలోని మాడుగుల గ్రామానికి చెందిన సంకురాత్రి నాగేశ్వరరావుకు మాచర్లకు చెందిన మంజుల అంజి గోవా మద్యం తీసుకువచ్చి విక్రయిస్తుండగా పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సంకురాత్రి నాగేశ్వరరావు వద్ద 9 ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మంజుల అంజి పరారీలో ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలి

వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి



పట్టణంలోని ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏఓ శ్రీనివాస్‌రెడ్డి

పిడుగురాళ్ల: ఎరువుల దుకాణ దారులు నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే సహించేది లేదన్నారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసిన వెంటనే రసీదును పొందాలని సూచించారు. అదేవిధంగా నిల్వలు, ఎగుమతికి సంబంధించిన స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

ఎంపీపీ అల్లు సత్యవతి



మాట్లాడుతున్న ఎంపీపీ అల్లు సత్యవతి

పిడుగురాళ్లరూరల్: ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ, మండల అభివృద్ధికి పాటుపడాలని ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీఓ కాశయ్య ఆధ్వర్యంలో ఎంపీపీ అల్లు సత్యవతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా శాఖల వారికిగా అమలు అవుతున్న పథకాలు, వారి అమలు తీరును అధికారులు సభ దృష్టికి తీసుకుని వచ్చారు. దీనిలో భాగంగా మండల వ్యవసాయ శాఖ అధికారి ఎ. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో రబీ పంట ఈ క్రాప్ బుక్కింగ్ చేసుకోవాలని, దీని ద్వారా రైతులకు చాలా ప్రయోజనాలు కలుగుతాయని, పండించిన పంటకు గిట్టుబాటు ధర కలుగుతుందన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటకు నష్టం వాటిల్లితే పంటకు భీమా వర్తిస్తోందన్నారు. ఇవన్ని గ్రామాల్లో రైతులకు ప్రజాప్రతినిధులు తెలియపరచాలని తెలియజేశారు. కరాలపాడు ప్రాథమిక వైద్యులు కె. ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఫ్యామిలీ వైద్యాన్ని ఇంటింటికి తీసుకొని వెళ్తున్నామన్నారు. ప్రతి పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నామన్నారు. పాఠశాలల్లో బోరు వాటర్‌లో ఫ్లోరిన్ శాతం ఉందో తెలుసుకుని దానికి కావాల్సిన సూచనలు పాఠశాల యాజమాన్యాలకు వివరిస్తున్నామన్నారు. ఎంపీపీ అల్లు సత్యవతి మాట్లాడుతూ ప్రభుత్వ హాస్పటల్‌లో కాన్పులను చేసే విధంగా ఏర్పాటు చేయాలని, వచ్చిన గ్రాంట్‌ను దానికి కావాల్సిన పరికరాలకు వాడుకోవాలని, త్వరలోనే ప్రభుత్వ హాస్పటల్‌లో కాన్పులు చేసే విధంగా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కాన్పులకు హాస్పటల్‌కు వెళితే లక్షలకు లక్షలు ఖర్చు అవుతుందని, అదే మన ప్రభుత్వ హాస్పటల్‌లో చేస్తే వారికి ఖర్చు తగ్గించిన వారిమి అవుతామన్నారు. అనంతరం అన్ని శాఖల అధికారులువారి ప్రోగ్రస్‌ను సభ దృష్టికి తీసుకొని వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ అల్లు సత్యవతి మాట్లాడుతూ... గ్రామాల్లో అన్నిశాఖ అధికారులు త్వరత్వరగా పనులు పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. మండలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పని చేయాలని ఆమె సూచించారు. అనంతరం నూతనంగా ఎన్నిక కాబడిన ఎంపీపీ అల్లు సత్యవతిని అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరెడ్డి, వైస్ ఎంపీపీ సాతులూరి బాబు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు తాటికొండ చిన్న ఆంజనేయులురెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ధనలక్ష్మి, ఎంఈఓ ఓ.రాజు, ఏపీఓ జయరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించేందుకే హలో నేస్తం

మాచవరం: ప్రజల అవసరాలకు అనుగుణంగా మెరుగైన వైద్య సేవలు అందించేందుకే హలో నేస్తం (మీ ఆరోగ్యం-మా భరోసా) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పల్నాడు హాస్పటల్ అధినేత చింతలపూడి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని మారు మూల గ్రామమైన రేగులగడ్డ నుంచి ఉచిత బస్సు సర్వీస్‌ను బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు ప్రాంత ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఇప్పటికే మూడు రూట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ బస్ సర్వీస్ ప్రతి బుధవారం రేగులగడ్డ నుంచి మొదలై చెన్నాయపాలెం, వేమవరం, మాచవరం, గంగిరెడ్డిపాలెం, గాంధీనగర్, బ్రాహ్మణపల్లి మీదగా పిడుగురాళ్ల పల్నాడు హాస్పటల్‌కు చేరుకుటుందన్నారు. హాస్పటల్‌కు వచ్చే ప్రతి రోగికి రూ.5లకే భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా 30 నుంచి 40 శాతం రాయితీపై, కొన్ని ఆపరేషన్లు ఉచితంగానూ, రాయితీపై వైద్యం చేయడం జరుగుతుందని తెలియజేసారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా గ్రామాల పెద్దలు డాక్టర్ అశోక్‌కుమార్‌ను దుశ్శాలువాలుతో సన్మానించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి పట్టణ సర్వే

గురజాల : నగర పంచాయతీ పట్టణ సర్వే గురువారం నుంచి ప్రారంభించడం జరుగుతుందని నగర పంచాయతీ కమిషనర్ అన్నదాత మోహన శ్రీనివాస్ సూచించారు. నగర పంచాయతీగా ఏర్పడిన సందర్భంగా గురజాల నగర పంచాయతీ పరిధి, సరిహద్దులు వంటివి సర్వే చేయడం జరుగుతుందన్నారు. పట్టణ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

రేషన్ పంపిణీ

మాచర్ల : రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విధానం ప్రకారం నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో రేషన్ నిత్యవసర వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని శరవేగంగా నిర్వహిస్తున్నారు. ఆయా సచివాలయాల పరిధిలోని ఎండిఎం వాహనాల ద్వారా నిత్యవసర పంపిణీ కార్యక్రమం కొనసాగిస్తున్నారు. అన్ని మండలాల్లో ఆయా తహసీల్దార్‌లు, సీఎస్‌డిటి మురళి ఆధ్వర్యంలో నిత్యవసర వస్తువుల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుంది. అధికారులు ఎక్కడికక్కడ పర్యవేక్షిస్తున్నారు. సచివాలయ వీఆర్‌వోలు, వలంటీర్లు రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

పథకాలపై ఆదివాసీలకు అవగాహన



మాట్లాడుతున్న మేడే వెంకట రమణ

సత్తెనపల్లి: ప్రభుత్వం దళిత, గిరిజన మహిళా సంఘాలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఉన్నతి పథకం ద్వారా రుణాలు మంజూరు చేస్తోందని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కోఆర్డినేటర్ మేడే వెంకటరమణ అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో పట్టణంలోని 16 వార్డు చెంచు కాలనీ కమ్యూనిటీ హాల్‌లో దళిత, ఆదివాసి మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. వెంకట రమణ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన రుణాలతో యూనిట్లు ఏర్పాటు చేసి ఆర్థికంగా ఎదగాలన్నారు. బ్యాంకు లింకేజీ, శ్రీనిధి, చేదోడు, చేయూత, రుణమాఫీ ప్రభుత్వం ఇస్తోందని వాటిని ఉపయోగించుకుని మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని అదే విధంగా సంక్షేమం, అభివృద్ధి, రక్షణ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. మీ పిల్లలను బడికి పంపించి అమ్మఒడి పొందాలని, ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం చేపడుతుందని దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చినటువంటి రుణాలను తిరిగి చెల్లించి మీరు ఆర్థిక అభివృద్ధిని సాధించాలన్నారు. ఏఎన్ఎం అంజలి దేవి మాట్లాడుతూ దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో దళిత, గిరిజన మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించిన నాడు మాత్రమే దళిత గిరిజన మహిళా సాధికారత సాధ్యపడుతుందన్నారు. సదస్సులో డీబీఆర్సీ ప్రతినిధులు పినపాటి ఈశ్వరి, ఆశ వర్కర్ సీహెచ్ ప్రమీల, మహిళలు, పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి

కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య



సచివాలయం సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్ శ్రీవిద్య

దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలో పన్నులు సకాలంలో వసూలు చేయాలని కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య అన్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో సచివాలయం సిబ్బంది సమావేశాన్ని బుధవారం నిర్వహించి పన్నుల వసూళ్లపై సమీక్ష జరిపారు. ఈ ఆర్థిక సంవత్సరంకు సంబంధించి రూ. 2.50 కోట్ల ఇంటి పన్నులు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటికి రూ.1.50 కోట్ల పన్నులు వసూలు చేశామని, మిగిలిన పన్నులను వేగవంతంగా వసూలు చేయాలని కమిషనర్ శ్రీవిద్య చెప్పారు. నీటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, ప్రకటన పన్నులు, ఆక్రమణ పన్నులు, దుకాణాలు పన్నులు త్వరితగతిన వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె తెలిపారు. పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దన్నారు. ఈ సమీక్షలో ఆర్ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిద్దాం



బాధ్యతలు చేపట్టిన సుబ్బమ్మ సాంబయ్యను సన్మానిస్తున్న ఎంపీపీ జయశ్రీ, వైఎస్సార్ సీపీ నేతలు

దాచేపల్లి : నగర పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తానని చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య చెప్పారు. ఇటీవల చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సుబ్బమ్మ సాంబయ్యను నగర పంచాయతీ కార్యాలయంలో ఎంపీపీ కటకం జయశ్రీబ్రహ్మనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సహకారంతో నగర పంచాయతీని అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలబెడతామని, నగర పంచాయతీలో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు సత్వరమే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సన్మానించిన వారిలో పార్టీ మాజీ మండల కన్వీనర్ షేక్ జాకీర్‌హుస్సేన్, మాజీ సర్పంచ్ కిష్టిపాటి అంకిరెడ్డి, కౌన్సిలర్లు చాట్ల క్రాంతికుమార్, మార్కెట్ యార్డు డైరెక్టర్లు యర్రంశెట్టి సైదారావు, షేక్ బుగ్గల జానీ, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ నాళం శ్రీనివాసరావు, నాయకులు కొప్పుల కృష్ణ, ఉల్లేరు హనుమంతరావు, నెల్లూరి కోటేశ్వరరావు, కొమ్ము బుజ్జి, కొత్వాల్ సైదా, అక్కినపల్లి శ్రీనివాస్ తదితరులున్నారు.

వైఎస్సార్ సీపీతోనే అన్ని వర్గాలకు మేలు

నాయీబ్రాహ్మణ సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరావు

మాచర్ల : రాష్ట్రంలో బిసి అభ్యున్నతితోపాటు అన్ని వర్గాలకు మేలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని నాయీబ్రాహ్మణ సంఘం మాజీ అధ్యక్షులు మాచర్ల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నాయీబ్రాహ్మణ సంఘం నాయకులను గతంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విస్మరించగా ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయా దేవాలయాల ట్రస్ట్ బోర్డు కార్యవర్గ సభ్యులుగా ఏర్పాటు చేసేందుకు జీఓను తీసుకురావడం ఎంతో సంతోషకరమన్నారు. ఇంత గుర్తింపు గతంలో ఎవరూ ఇవ్వలేదని, బీసిలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చిన ఘనతతోపాటు నాయీబ్రాహ్మణ సంఘం వారిని 660 దేవాలయాల్లో పాలకవర్గ సభ్యులుగా నియమించటానికి తీసుకున్న నిర్ణయం మరిచిపోలేనిదన్నారు. రాబోయే రోజులలో కూడా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి నాయీ బ్రాహ్మణుల తరపున జేజేలు పలుకుతామని తెలియపరుస్తూ సీఎం జగన్‌కు, ప్రభుత్వ విప్ పీఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

పిడుగురాళ్ల: పట్టణంలోని ప్రజాశక్తి నగర్‌లోని కన్నెగంటి హనుమంత్ భవనంలో రైతు కూలీ సంఘం సమావేశం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ నరేంద్రమోడీ ప్రభుత్వం రైతులకు, కార్మికులకు నష్టం చేసే చట్టాలను తీసుకొచ్చిందని, దీని వల్ల రైతాంగం గిట్టుబాటు ధర లేక వ్యవసాయం సంక్షోభంలో పడిందని వ్యవసాయానికి కేంద్ర బడ్జెట్టులో నిధులు కోత పెట్టిందని వ్యవసాయానికి నిధులు పెంచాలని బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్పొరేటర్లకి లాభాలు చేకూర్చే విధంగా చట్టాన్ని మార్చాలని, పట్టణ ప్రాంతాలకు కూడా ఉపాధి హామీ పనులు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బుంగా నాగేశ్వరరావు, దీకొండ వెంకటేశ్వర్లు, టి. సుబ్బయ్య, బత్తుల వెంకటేశ్వర్లు, గుడిపాటి సుందర్‌రావు, సలోమను, జగన్నాధం, నరసమ్మ, జడ అచ్చమ్మ, మేరిగ్రేసేస్, సంపతి వెంకట కృష్ణ తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో మూడు మూగ జీవాలు మృతి



విద్యుత్ షాక్‌నకు గురై మృతి చెందిన జీవాలు

మాచవరం: మండలంలోని తురకపాలెం గ్రామ శివారులోని రాళ్లవాగు ప్రాంతంతో వ్యవసాయ విద్యుత్ కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగిలి విద్యుదాఘాతంతో మూడు మూగ జీవాలు మృతి చెందినట్లు బాధితురాలు షేక్ జాన్‌బి తెలిపారు. పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఏర్పాటు చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, పలు సార్లు పొలం యజమానికి, విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆ ప్రాంతంలో తమ సొంత పొలాలు ఉన్నాయని, పశువులు మేత కోసం వెళ్తుండగా గతం లోనూ రెండు సార్లు జీవాలు, పశువులు మృతి చెందాయని చెప్పారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌పార్మర్ ఎత్తులో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.